నమస్తే తెలంగాణ
సూర్యాపేట
10 | నల్లగొండ, బుధవారం 22 జనవరి 2025 | SURYAPET

నల్లగొండలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన రైతు మహా ధర్నా ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. మున్సిపల్ చాంబర్ బయట కూర్చున్న కంచర్లపై మంగళ వారం ఒక్కసారిగా తీవ్రమైన పదజాలంతో దూషిస్తూ దూసుకొచ్చిన మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, వారి అనుచరులు కుర్చీలు, పూలకుండీలు విసిరి దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా అక్కడ వాతావరణంగా ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు మధ్య తోపులాట జరిగింది. తేరుకున్న పోలీసులు ఇరువర్గాలను రెండువైపులా చెదరగొట్టారు. బీఆర్ఎస్ నేతలను సీసీ చాంబర్‌కు, కాంగ్రెస్ శ్రేణులను రెవెన్యూ సెక్షన్‌లోకి తోశారు. దాడిలో సొమ్మసిల్లిపోయిన కంచర్లను సీసీ చాంబర్‌లో నీరు తాగించి ఆయనను అయన వెంట ఉన్న ముఖ్యనాయకులను బలవంతంగా బయటకు ఎత్తుకొచ్చి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం యుద్ధ వాతావరణంగా మారిపోయింది. కాంగ్రెస్ గూండాల దాడిలో కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి.

– నీలగిరి, జనవరి 21

బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ మూకల దాడి

కుర్చీలు, పూల కుండీలు విసిరేసి బీభత్సం

- దాడిలో సొమ్మసిల్లిపోయిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే కంచర్లతోపాటు బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టు
- దాడి చేస్తున్నా కాంగ్రెస్ గూండాలను నిలువరించని పోలీసులు
- నోటీసులు ఇవ్వకుండా బీఆర్ఎస్ మహా ధర్నా ఫ్లెక్సీలు తొలగించిన మున్సిపల్ అధికారులు
- పథకం ప్రకారం ఫ్లెక్సీల మాటున దాడి చేశారంటున్న గులాబీ నేతలు

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని లాక్కెళ్తున్న పోలీసులు

నల్లగొండ మున్సిపల్ ఆఫీస్‌లో కాంగ్రెస్ మూకల దాడిలో ధ్వంసమైన పూల కుండీలు

ఫ్లెక్సీల మాటున పథకం ప్రకారం దాడి.

నల్లగొండ కేటీఆర్ మహా ధర్నా సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల మాటున మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించారు. అధికార మదంతో దాడి చేసేందుకు వీలుగా పోలీసులను సైతం కాంగ్రెస్ గూండాలు వాడుకున్నారు. నల్లగొండ పట్టణంలో ఫ్లెక్సీల విషయంలో కమిషనర్ స్పందించకపోవడం, కంచర్ల పార్టీ నాయకులు, కార్యకర్తలతో మున్సిపల్ ఆఫీసుకు రావడంతో కాంగ్రెస్ నాయకులు దాడికి పథకం పన్నినట్లు తెలుస్తున్నది. సుమారు రెండువందలకు పైగా మున్సిపాలిటీ వద్దకు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా చైర్మన్ చాంబర్‌ను నుంచి కిందికి దిగి తీవ్రమైన పదజాలంతో కంచర్ల వైపు దూసుకువచ్చారు. వారు వస్తుంటే ముగ్గురు సీఐలు ఎనిమిది మంది ఎస్ఐలు ఉన్నా కూడా అపలేదు. సుమారు రెండువందల మంది వరకు కాంగ్రెస్ శ్రేణులు మున్సిపల్ కార్యాలయంలో గుమిగూడినా పట్టించుకోలేదంటే పోలీసుల వైఖరి ఏమిటో స్పష్టంగా అర్థమవుతుంది. భూపాల్‌రెడ్డి చాంబర్‌లో ఉన్నప్పటికీ కావాలనే నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు ఆయనను బయటకు ఎత్తుకొచ్చారు. అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లకుండా చాంబర్ బయట ఉంచారు. భూపాల్‌రెడ్డిపై దాడికి పోలీసులు కూడా పరోక్షంగా సహకారం అందించారనే చెప్పాలి.

మున్సిపల్ కమిషనర్ పక్షపాత ధోరణి

నల్లగొండ పట్టణంలో కేటీఆర్ రైతు మహాధర్నా సందర్భంగా ఫ్లెక్సీలను బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేశాయి. బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు కూడా సంక్రాంతి, నూతన సంవత్సర సందర్భంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. కానీ మున్సిపాలిటీ అధికారులు ధర్నాకు అనుమతి లేదని సోమవారం రాత్రి నుంచే ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఈవిషయం కమిషనర్‌కు చెప్పాలని ఫోన్ చేయడంతో అయన లిఫ్ట్ చేయలేదు. రాత్రి సమయంలో సరైందికాదని ఆయన ఉదయం కూడా కమిషనర్‌కు ఫోన్ చేశారు. కానీ కమిషనర్ నుంచి స్పందన రాకపోవడం, ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం జరుగుతుండడంతో చేసేది లేక ఆయనే స్వయంగా బీఆర్ఎస్ కార్యకర్తలతో మున్సిపాలిటీకి కంచర్ల వచ్చారు. కమిషనర్ లేకపోవడంతో ఆయన చాంబర్‌లో కూర్చొని కమిషనర్‌కు ఫోన్ చేశారు. కానీ అయన నుంచి స్పందన రాకపోవడంతో కార్యకర్తలతో అక్కడే బైఠాయించి కమిషనర్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసుల వచ్చి వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ కమిషనర్ వచ్చేంత వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో చేసేది లేక బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చాంబర్‌లో కేవలం మాజీ ఎమ్మెల్యే కంచర్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి,

బీఆర్ఎస్ నేతలపై దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మాదగోని గణేశ్, కోఅప్షన్ సభ్యులు జమాల్‌ఖాద్రి మాజీ కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. సుమారు గంటపాటు వారు అక్కడే ఉన్నారు. ఇంతలోనే పోలీసులు వీరిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. మరోవైపు కమిషనర్ చాంబర్‌లో అందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అక్కడకు చేరుకుని చైర్మన్ చాంబర్‌లోకి వెళ్లారు. ఒక్కొక్కరుగా కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఇతర నాయకులు వందలాది మంది అక్కడకు చేరుకున్నారు. సుమారు ఈ హైడ్రామా అంతా రెండుగంటలపాటు సాగింది.

కోమటిరెడ్డివి దుర్మార్గపు చర్యలు

- కుట్రతోనే గూండాలతో నాపై దాడి చేశారు
- నాంపల్లిలో విలేకరులతో మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ : అధికారంలోకి వచ్చిన 13 నెలల్లో కాంగ్రెస్ రౌడీయిజానికి తెరలేపిందని, కోమటిరెడ్డి కుట్ర పూరిత చర్యల్లో భాగంగానే మంగళ వారం నల్లగొండలోని మున్సిపల్ ఆఫీసులో తనపై దాడి జరిగిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. నల్లగొండ మున్సిపాలిటీలో స్థానిక పోలీసులు కంచర్లను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం సాయంత్రానికి విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్కడ కంచర్ల మీడియాతో మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. కాంగ్రెస్ రౌడీలు, ఆయన గూండాలు తనపై పూలకుండీలతో దాడి చేసినట్లు తెలిపారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నల్లగొండలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, నెలల తరబడి ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగించకుండా, తమ ధర్నా కార్యక్రమం పూర్తవ్వకుండానే వాటిని తొలగించినట్లు తెలిపారు. ధర్నా పెట్టుకుంటామంటే అనుమతి ఇవ్వకుంటే కోర్టుకు వెళ్లామని, విషయం కోర్టులో ఉండగా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారని కమిషనర్‌ను అడగడానికి మున్సిపాలిటీకి వెళ్లే పోలీసులు పిలిపిస్తామంటే అక్కడే ఉన్నట్లు తెలిపారు. పిలిపిస్తామన్న పోలీసులు కాసేపటికే కమిషనర్ రావట్లేదని చెప్పగా ఎందుకు రారని ప్రశ్నిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ గూండాలు గుమ్మల మోహన్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డి పూలకుండీలతో తనపై దాడి చేసినట్లు చెప్పారు. ముగ్గురు సీఐలు అక్కడే ఉండి తనపై దాడి చేయించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తే కాంగ్రెస్ వాళ్లకు కలిగే ఇబ్బంది ఏంటో అని ప్రశ్నించారు. తమపై దాడి చేసిన గుమ్మల, బుర్రిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ దాడికి తగ్గ ప్రతి ఫలం పొందుతాడని హెచ్చరించారు. ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉనికి కనుమరుగైతుందని, ఐదేండ్లు ప్రశాంతంగా ఉన్న నల్లగొండలో కాంగ్రెస్ అలజడి సృష్టించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజలకు తెల్వకుండానే లబ్ధిదారుల జాబితా

గ్రామ సభల్లో ఎంపిక చేయకుండా ప్రభుత్వం ఫైనల్ చేయటమేంది?

- కాంగ్రెస్ నేతల పేర్లతోనే జాబితాలు సిద్ధం
- హామీలు నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్.. భౌతిక దాడులకు తెర
- కోమటిరెడ్డి సోయిలేని మాటలు అధికారులు అమలు చేయడం సరికాదు
- కేటీఆర్ వస్తానంటేనే కోమటిరెడ్డికి వణుకు
- కోర్టు అనుమతితో నల్లగొండలో పెద్దఎత్తున రైతు ధర్నా నిర్వహిస్తాం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్ తదితరులు

నల్లగొండ, జనవరి 21 : పథకాలు ప్రజలకివ్వాలంటే గ్రామ సభల్లో లబ్ధిదారుల జాబితా ఎంపిక చేయాలని, అసలు ప్రజలకు తెల్వకుండా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల జాబితా పంపడమేంటని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేరుకు గ్రామ సభలు అని పెట్టి ప్రభుత్వం ఇచ్చిన జాబితాలు చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయా జాబితాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పేర్లతోనే సిద్ధమై వచ్చినట్లు తెలిపారు. అధికారులు, ప్రజలకు సంబంధం లేకుండా హైదరాబాద్ నుంచి వచ్చిన ఈ జాబితాలను ప్రజలు వ్యతిరేకించి ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన దరఖాస్తులు చెత్తకుప్పలో వేసిన ప్రభుత్వం, ప్రజలకు సంబంధం లేకుండా జాబితాలు సిద్ధం చేశారని, ఈ విషయం ఇవ్వాల జిల్లాలో ప్రజల నుంచి వచ్చిన నిరసనలతో తేటతెల్లం అయ్యిందని చెప్పారు. ఏడాదిలో రూ.1.40లక్షల కోట్లు అప్పు తెచ్చి పథకాల పేరుతో ప్రజలకు సగం కూడా ఇవ్వకుండా, కమీషన్లు దండుకోని ఢిల్లీకి పంపిస్తున్నట్లు ఆరోపించారు. రైతు బంధు ఎగ్గొట్టిన ప్రభుత్వం తులం బంగారం, కేసీఆర్ కిట్, 24గంటల కరెంట్ లాంటి వాటన్నింటినీ నిలిపివేసిందన్నారు.

భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులు

రాష్ట్రంలో ఏడాది కాలంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్ ఇటీవల కాలంలో భౌతిక దాడులకు తెర తీసిందని మండిపడ్డారు. నల్లగొండలో కోమటిరెడ్డి కావాలనే కుట్రతోనే భూపాల్ రెడ్డిపై దాడి చేయించాడని, అసలు మున్సిపాలిటీలో కాంగ్రెస్ గూండాలకు ఏం పని అని ప్రశ్నించారు. ఫ్లెక్సీలు కట్టినప్పుడు అనుమతి తీసుకోకపోతే నోటీస్ ఇవ్వాలని, లేదంటే ట్యాక్స్ కట్టమని చెప్పాలని, కానీ సమాచారం లేకుండా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. సోయి లేకుండా కోమటిరెడ్డి చెప్పిన మాటలు విని అడ్డగోలుగా చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అధికారులకు సూచించారు. వాస్తవంగా ఈ నెల 12న పెట్టాల్సిన రైతు ధర్నా పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ ఉంటుదన్న పోలీసుల సూచనతోనే ఈ నెల 21కి మార్చితే 21న కూడా అనుమతి ఇవ్వకుండా కోమటిరెడ్డి కుట్ర పన్నాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకొని నల్లగొండలో పెద్ద ఎత్తున రైతు మహా ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. తాము ధర్నా చేస్తామంటేనే ప్రభుత్వానికి భయం పట్టుకుందని, గ్రామ సభల్లో ఊరూరా నిలదీస్తున్న ప్రజలు ఒక దగ్గర చేరి గర్జిస్తే ఎలా ఉంటదనే భయంతోనే అనుమతి ఇవ్వలేదని విమర్శించారు. నల్లగొండను దత్తత దీసుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఏడాది కాలంలోనే అద్భుతంగా తీర్చి దిద్దితే ఏడాది కాలంలో కోమటిరెడ్డి సర్వనాశనం చేయటంతో పాటు రౌడీలకు అడ్డాగా మార్చాడని తెలిపారు. గ్రామాల్లోకి వెళ్తే కాంగ్రెస్ కార్యకర్తలే నిలదీస్తున్న పరిస్థితులు కోమటిరెడ్డి గమనించాలని, ఈ నిలదీతలు నిన్ను చెప్పుతో కొట్టినట్లు అనిపిస్తలేవా అని అన్నారు. సోయి లేకుండా నీచంగా ఫ్లెక్సీల మీద రాజకీయం చేయడం కోమటిరెడ్డి దిగజారుడుకు నిదర్శమని తెలిపారు. మీరు పెంచి పోషించిన కరువును పదేండ్లల్లో పోగా నల్లగొండలో 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తే వచ్చిన ఏడాది లోనే సర్వనాశనం చేశారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ, సూర్యాపేట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్, రేగట్టె మల్లిఖార్జున్ రెడ్డి, తండు సైదులు గౌడ్, మందడి సైదిరెడ్డి, కరీంపాష, బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్లను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కంచర్లను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నల్లగొండలో అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌తో పాటు మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్, నకిరేకల్, భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడి ఘటనపై కంచర్లను అడిగి తెలుసుకున్నారు.

గ్రామసభల్లో గందరగోళం

- లబ్ధిదారుల జాబితాపై ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో తొలిరోజు అడ్డగింతలు.. నిలదీతలు
- అర్హులకు చోటేదని ఆగ్రహం
- రేషన్‌కార్డుల్లో పలుచోట్ల అనర్హులకే పెద్దపీట
- కొత్తగా దరఖాస్తులకు వెల్లువ

నల్లగొండ ప్రతినిధి/సూర్యాపేట, జనవరి21(నమస్తే తెలంగాణ) : అందరూ ఊహించినట్లుగానే మంగళవారం నుంచి మొదలైన వివిధ ప్రభుత్వ పథకాల ప్రజాపాలన గ్రామ సభలు తీవ్ర గందరగోళం నడుమ కొనసాగాయి. గ్రామ సభల్లో వెల్లడించిన లబ్ధిదారుల జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలుచోట్ల నీలదీతలు, అడ్డగింతలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో భారీగా కోత పెట్టారని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మంజూరైన రేషన్‌కార్డుల్లో ఎక్కువ మంది అర్హులకు చోటుదక్కలేదని పలుచోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పలేక తూతూమంత్రంగా ముగించేసి వెళ్లిపోయారు. చాలా చోట్ల జాబితాలో చోటుదక్కని వారే ఎక్కువగా కనిపించగా వారంతా తిరిగి దరఖాస్తులు పెట్టుకునేందుకు ఎగబడ్డారు. మొత్తంగా తొలిరోజు తీవ్ర గందరగోళం నడమ గ్రామ సభలు ముగిశాయి.

నల్లగొండ జిల్లావ్యాప్తంగా తొలిరోజు 223 గ్రామ సభలు, 48 వార్డు సభలు జరిగాయి. వీటిల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించారు. అయితే రైతుభరోసా మినహా మిగతా పథకాల జాబితాలపై ప్రజల నుంచి ఎక్కువగా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. మునుగోడు మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో రేషన్‌కార్డులపై ప్రజలు అధికారులను నిలదీశారు. కేవలం కొద్దిమంది పేర్లనే ఎలా పెట్టారని మిగతా వారూ ఏమై పోవాలని ఆగ్రహం వ్యక్తం చేయగా కొత్తగా దరకాస్తులు ఇవ్వాలని అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. త్రిపురారం మండలం కేంద్రంలో ఆరు వేల జనాభా ఉంటే ఇక్కడ కేవలం ఐదు గురికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు రావడంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పీఏపల్లి మండలం అంగడిపేటలో గతంలో ఇచ్చిన దరఖాస్తులేమయ్యాయని, కొత్తగా దరఖాస్తులు ఎందుకు అని అధికారులను నిలదీశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలోని పలువార్డుల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు జాబితాల్లో చాలా పేర్లు గల్లంతయ్యాయని ప్రజలు ఆగ్రహాహం వ్యక్తం చేస్తే కొత్తగా దరఖాస్తులు తీసుకుని నచ్చజెప్పారు. చిట్యాల మండలం ఏపూరు, ఎలికట్టె గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులను, భూమి ఎక్కువ ఉన్న వారిని సైతం రేషన్‌కార్డుల జాబితాలో చేర్చారని, అనర్హులను పక్కన పెట్టారంటూ ఆందోళన చేశారు. ఏపూర్‌లో తిరిగి లబ్ధిదారుల జాబితాను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధికారులకు అందజేశారు. చండూరు మున్సిపాలిటీలో నిరుపేదలకు కాకుండా పక్కా ఇండ్లు ఉన్నవారికీ జాబితాలో పేరు రావడంపై

చిట్యాల : ఎలికట్టెలో పథకాల జాబితాలో అనర్హులున్నారని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మహిళలు అగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ మండలం కంచనపల్లిలో ఆత్మీయ భరోసా తమ పేర్లు ఎందుకు లేవని భూమిలేని మహిళలు నిలదీశారు. ముషంపల్లిలో రేషన్‌కార్డుల జాబితాలో అందరూ భూములు ఉన్న వారే ఉన్నారని, నిరుపేదలకు కార్డులు ఇవ్వరా అని ప్రశ్నించారు. కట్టంగూరు మండలం పిట్టంపల్లిలో భూములు ఉన్న వారి పేర్లు ఆత్మీయ భరోసా జాబితాలో రావడంపై నిలదీశారు. అదేవిధంగా రుణమాఫీ ఎప్పుడు చేస్తారని కూడా రైతులు ప్రశ్నించడంతో కొద్దిసేపు గందరగోళ నెలకొంది. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో రేషన్‌కార్డులు, ఇండ్లు లేనివాళ్లు వంద మందకి పైగా ఉంటే కేవలం 20 నుంచి 30 మందికే జాబితాలో పేరు రావడంతో అధికారులతో వాదనకు దిగారు. రుణమాఫీ గురించి కూడా ప్రశ్నించారు. కనగల్ మండలంలో నిరుపేదలకు కాకుండా భూస్వాముల పేర్లే పథకాల్లో ఉన్నాయని ప్రజలు ఆరోపించారు. శాలిగౌరారం మండలం చిత్తలూరు, వంగమర్తి గ్రామాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొనగా ప్రజలు గ్యాస్ డబ్బులు, రుణమాఫీ డబ్బులు పడలేదని ప్రశ్నించారు. నకిరేకల్ మండలం ఓగోడు, నడిగూడెం, నోముల గ్రామాల్లో ధాన్యం బోనస్ డబ్బులు పడలేదని, రుణమాఫీ జరుగలేదని రైతులు నిలదీశారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా పేరు రాలేదని ఇంకా ఎన్ని సార్లు దరఖాస్తు చేయాలని అధికారులను ప్రశ్నించారు. ఇలా చాలా చోట్ల ముందే సిద్ధం చేసుకుని వచ్చిన లబ్ధిదారుల జాబితాలపై తీవ్ర గందరగోళం నెలకొంది.

కోదాడ రూరల్ : లిస్టు ఏ ప్రమాణికంగా ఎంపిక చేశారని అధికారులను ప్రశ్నిస్తున్న అల్వాలపురం గ్రామవాసి

నల్లగొండ మండలం కంచనపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఇవే తుది జాబితాలు కావు : కలెక్టర్ త్రిపాఠి

ప్రస్తుతం గ్రామ సభల్లో చదువుతున్న జాబితాలే తుది జాబితాలు కావని, గతంలో దరఖాస్తులు చేసిన వాటి ఆధారంగా రూపొందించినవని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వీటిలో అభ్యంతరాలు ఉన్నా, జాబితాలో ఎవరి పేర్లు అయినా లేకపోతే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళవారం తొలిరోజు గ్రామ సభలపై అధికారులతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలిరోజు 233 గ్రామ సభలు, 48 వార్డు సభలు ఇబ్బందులు లేకుండా ముగిసినట్లు ప్రకటించారు. కొన్నిచోట్ల జాబితాలో పేర్లు రాలేదన్న విషయాలు తమ దృష్టికి వచ్చాయని, కొత్తగా దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక అధికారులు గ్రామ సభలను ఓపికగా నిర్వహించాలని, ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత తమదేనని సూచించారు.

సూర్యాపేట జిల్లాలో..

అర్హులందరికీ పథకాలు అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేర్లు లేకపోవడంతో సూర్యాపేట జిల్లాలోనూ గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. పలుచోట్ల అధికారులతో వాగ్వాదానికి దిగారు. సూర్యాపేట పట్టణంలోని 1వ వార్డు, తిరుమలగిరి మున్సిపాలిటీలోని 4వ వార్డు, కోదాడ మండలం గుడిబండ, మునగాల మండలం నారాయణగూడెంలో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉద్రిక్తతలకు దారి తీసింది. మేళ్లచెరువు మండలం నల్లబండగూడెం, కందిబండ గ్రామాల్లో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. మోతె మండలం సిరికొండలో ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారి పేర్లు రేషన్ కార్డుల జాబితాలో వచ్చాయని నిలదీశారు. ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్‌లో సంపన్న వర్గాలకే కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేస్తుందా అని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ నిబంధన ప్రకారం ఉపాధిహామీ పథకంలో పది రోజులు పని చేసిన జాబ్‌కార్డు ఉందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీం కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 24 రోజులు చేసి ఉండాలి అనేది నిబంధన కేవలం పథకాన్ని కుదించడం కోసమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా చోట్ల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఏకపక్షంగా ఎంపిక చేశారని అధికార పార్టీకి చెందిన నాయకులే ప్రశ్నించడం కనిపించింది. క్షేత్ర స్థాయిలో జరిగిన సర్వే ప్రకారం కాకుండా భూమి ఉన్నవాళ్లకు ప్రభుత్వం స్కీమ్‌లను అమలు చేస్తూ ఏమీ లేని వారికి ఇవ్వడం లేదని వాపోయారు.

సూర్యాపేట 1వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు